శాంతించిన సముద్రం

ఆఫీసునుంచి కాస్త ఆలస్యంగా బయలుదేరాల్సి వచ్చింది. వెంకటరమణ వస్తూనే గదిలో ఓ మూలన బూట్లు విడుస్తూ ఓరగంటితో నాలుగు మూలలా కలయ జూశాడు. కనుచూపుమేరవరకూ ఇంట్లో ఎవరూ కనబడలేదు. మనిషి అలికిడి కూడా లేనట్లే అనిపించింది. తల వంచుకొని గదిలో బట్టలు మార్చుకుని వంట యింట్లోకి తొంగిచూశాడు.

"మీకు గదిలోకి తీసుకురానా టిఫిన్!" సావిత్రి గ్లాసులో మంచినీళ్లుపోస్తూ తల ఎత్తి చూసింది.

"ఎందుకు? నేనే వస్తాగా అక్కడికి ఎప్పుడూ వచ్చినట్లు?" ఆశ్చర్యాన్ని తమాయించుకొని తువాలుతో ముఖం తుడుచుకున్నాడు

"గదిలోనే బాగుంటుంది లెండి. ఇక్కడంతా చికాకుగా ఉంది" సావిత్రి అప్పటికప్పుడే కుర్చీ దగ్గరగా ఒక స్టూలువేసి టిఫిన్ ప్లేటూ, మంచినీళ్ల గ్లాసూ పెట్టింది. కాఫీ కప్పు చేతిలో పట్టుకు నిల్చుంది.

దిక్కులు చూస్తూ అరటికాయ బోండా నములుతున్న వెంకటరమణ "నీవు కూడా తీసుకో" అనాలనుకున్నాడు. కొంతసేపటి వరకూ ప్రాణము కొట్టుకు పోయింది. కాని మాట్లాడకుండా పెట్టింది. తిని బయటపడ్డాడు.

అంతలో స్నేహితులు పిలిచారు. అటునుంచి అటే సినీమాకు తీసుకెళ్లారు. కబుర్లు చెప్పుకుంటూ బయలుదేరి ఇళ్లను చేరుకునేసరికి పదకొండు కావచ్చింది. ఆలస్యమయినా తలుపు తట్టీతట్టడముతోనే తెరుచుకుంది.

వెంకటరమణను చూడగానే సావిత్ర భోజనం పెట్టి ఎదురు చూడటము మొదలుపెట్టింది.

"నా కోసం ఎందుకు కూర్చున్నావు? భోజనం చెయ్యకపోయినావా?" అన్నట్టు ముఖంపెట్టి భోజనం చేశాడు. సావిత్రి అతడికి కావలసిన మంచినీళ్ళు మంచంకింద పెట్టింది. పలకరిస్తే కిలకిల్లాడుతూ కబుర్లు చెప్పేటట్లు ఉన్నది. వెంకటరమణ యధాప్రకారం పేపర్లు చదువుకొని ఫైల్సు చూసుకున్నాడు. ఏమీ గమనించనట్టుగా.

వెంకటరమణ ఉంటున్న ఇంటి ప్రక్కవాటాలోకి క్రొత్తగా ఎవరో వచ్చారు. ఆయన పదిగంటలకే ఆఫీసుకు వెళ్ళిపోతాడు. ఆవిడకు పిల్లనెత్తుకోవటమయినా చేతకానట్టుంది. ఇంట్లో పని ముట్టుకుంటున్నట్లు కూడా కనబడదు. ఆయన తల్లి మోకాళ్ళ నొప్పులతో సణుక్కుంటూ పనిచేసుకుంటూ ఉంటుంది. భోజనాలు కాగానే పిల్లను ఎత్తుకొని వాకిట్లో నిలబడేది. సంకోచం లేకుండా వంటయింట్లోకి వచ్చి సావిత్రిని పలకరిస్తూ ఉండేది.

కొత్తలో సావిత్రి బెట్టుగా ఉన్నా ఆవిడ చనువు తీసుకొని పలకరిస్తూంటే కలుపుకు మాట్లాడక తప్పలేదు. మాటల సందర్భంలో తన కొడుకు రంగధామరావు విశాఖపట్నంలో ఆనర్సు చదువుకున్నాడని చెప్పింది

ఆంధ్రా యూనివర్సిటీలో ఆనర్సు చదివిన రంగధామం పేరు వింటూనే సావిత్రి త్రుళ్ళిపడ్డది. ఆనాడంతా పని చెయ్యటంలో తడబడ్డట్టయింది. ఎన్నడూ లేనిది చేతిలోనుంచి వస్తువులు జారిపోతున్నాయి. ఫ్లాస్కులో కాఫీపోసి బల్లమీద పెట్టబోయింది. ధన్‌మంటూ కిందబడి ఫ్లాస్కు ముక్కలయింది. కాఫీ నేలపాలయింది. ఆనాడు వెంకటరమణకు మధ్యాహ్నం కాఫీ లేకుండా పోయింది.

సాయంత్రము వంటచేసి పెట్టుకొని వాకిటి తలుపు తెరుచుకొని సావిత్రి పత్రిక చదువుతున్నది. పక్కింటి ముసలమ్మగారు కూరగాయల బేరం చేస్తున్నది. ఆమె గలగల్లాడుతూ మాట్లాడుతూంటే చదువలేక పేపరక్కడ పడేసి తనూ కూరగాయల బేరానికి లేచింది. వంకాయలు మెత్తటివి ఏరుతుండగా బూట్లశబ్దము వినవచ్చింది. తల ఎత్తి చూస్తే ఫుల్‌సూట్‌లో ఠీవిగా నడుస్తూ పక్కవాటాలోకి పోతున్నాడు రంగధామం.

గమనించినట్టు పైకి కనబడకుండా తలవంచుకుంది. కూరలు పట్టి చూస్తున్నట్లు చూపి చప్పున లోపలికి వెళ్ళింది. వంటయింట్లో ఏదో పని చెయ్యబోయింది.

ధ్యాస నిలువలేదు. గదిలోకివెళ్ళి వేసిన పక్క దులిపి మళ్ళీ వేసింది. వెంకట రమణ బల్ల అంతా దులిపి కాగితాలూ, పుస్తకాలూ సర్ది పెట్టింది. అతడి బట్టలు తాడుమీద వేళ్ళాడుతున్నవన్నీ తీసి మడతలేసింది. మనసు శాంతపడాలనీ, తొట్రుపాటు సర్దుమణగాలనీ ఆమె చేసిన ప్రయత్నాలు అన్నీ వ్యర్థమయ్యాయి.

పక్కవాటా తలుపు సందుల్లోంచి దీపపు వెలుతురు నాలుగు గీతల్లా కనిపిస్తున్నది. మనుష్యుల రాకపోకల నీడలు ఇటూ అటూ ఆడుతున్నాయి.

'పిల్ల భుజంమీద నిద్రపోతున్నది. వాడికి వడ్డించకూడదూ తాయారూ ?'' ముసలమ్మ అటూ ఇటూ పచారు చేస్తున్నట్టు అడుగుల చప్పుడవుతున్నది.

"ఊఁ" అని మూలిగిన శబ్దము.

'పిల్లను పడుకోబెట్టి నీవు వడ్డించవమ్మా ?

'నాయనా ! దాన్ని ఒక్కసారయినా బయటకు తీసుకువెళ్ళరా పాపం'

''అన్నం తినటానికి తీరికలేదు కాని సినీమాలట నా కాగితాల కట్టలు చూస్తూ కూడా అట్లా అంటావేం ?''

ఈ మాటలన్నీ ఎవరెవరి మధ్య జరుగుతున్నాయో కంఠధ్వనులనుబట్టి సావిత్రి గ్రహించింది. కూడదనుకున్నా మనస్సు అటే నిలిచింది. తలుపులు నెట్టుకుని వెంకటరమణ లోపలికి వచ్చాడు. అతడిని చూడగానే లేచి వంట యింట్లోకి వెళ్ళి ఇద్దరికీ భోజనము తయారుచేసింది. అతడు పీటమీద కూర్చోగానే తను కూడా భోజనము చేయటము మొదలుపెట్టింది. అతడు కావలసిన పదార్థాలు వడ్డించుకో బొయ్యాడు. అతడి చేతిలో గరిట సావిత్రి అందుకొని తానే వడ్డించింది.

భోజనము అయిన తరువాత అతడు పైల్సులో తల దూర్చాడు. సావిత్రి తలలో పూలు సర్దుకుంటూ అతడు విడిచిన చెప్పులను మట్టి దులిపి గోడవారగా పెట్టింది. ఎదురుగుండా కుర్చీవేసుకొని నవల చేత బట్టుకొని పేజీలు తిప్పటము మొదలుపెట్టింది.

ఉదయము తొమ్మిది గంటలకల్లా ఇటీవల లభ్యమవుతున్న తన కమ్మటి భోజనాన్ని గురించి ఏవేవో ఊహలు ఊహించుకుంటూ చిరునవ్వులతో వెంకట

రమణ ఆఫీసుకు వెళ్ళాడు. సావిత్రి తడి తువ్వాల ఎండవేయడానికి పెరట్లోకి వెళ్ళింది. రంగధామం విసురుగా అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్లాడు. తరువాత కొంచెము సేపటికి ఖణేలుమన్న శబ్దం వినవచ్చింది.

"ఎందుకురా అంతపని చేశావు?' అన్నంపళ్ళెం తన్నుకుంటారా ఎవరయినా? ఇదేం కోపం రా?''

సావిత్రి తలవంచుకొని లోపలికి వెళ్ళింది.

మధ్యాహ్నం పిల్లవాడిని పడుకోబెట్టి రంగధామంభార్య సావిత్రి గదిలోకి వచ్చింది. సావిత్రి కిటికీలో కూర్చుని వెంకటరమణ ప్యాంటుకు పగిలిన గుండీలు తీసి క్రొత్తవి కుట్టుతున్నది. ఆమెను చూడగానే చాపలేపి కూర్చోమన్నది

రంగధామం భార్య తాయారు చూడటానికి బాగానే ఉంటుంది. కాని దిద్దుబాటు తక్కువ. తల దువ్వుకొని బొట్టుపెట్టుకుంటేనే ఆకర్షణీయంగా ఉంటుంది. కాని ఆ పని శ్రద్ధగా ఉదయమూ చెయ్యదు; సాయంత్రమూ చెయ్యదు ఎగుడు దిగుడుగా చీరె కట్టుకుని కొంగు జార్చుకుని నేల ఊడుస్తూ తిరుగుతుంది

"అబ్బాయి పడుకున్నాడేమిటి? చప్పుడులేదు?'' అని అడిగింది సావిత్రి - కూరలు ఏం వండుకున్నారని అడగలేక.

"వాడు నా ప్రాణానికో యముడనుకోండి. రాత్రీ పగలూ కూడా నిద్రపోనీయడు."

"అయితే మీ కొక్కడేనా యముడు?'' అన్నది సావిత్రి నవ్వుతూ.

"నా జన్మకు నిద్రపోయినంత సేపే సుఖమనుకోండి. ఈ భాగ్యానికి మా నాన్న ఎనిమిదివేలు పోశాడు.''

"మనం కొన్నవన్నీ బాగా వుంటాయా చెప్పండి? సరే కాని - మీరు ఈ ఊళ్ళో నాలుగు మూలలా వెళ్ళి చూశారా? పార్కు, మ్యూజియమ్ కోట వెళ్ళారా?''

"ఎక్కడండీ! ఇంట్లో ప్రశాంతంగా అన్నం తింటే చాలు'' తనను గురించిన ప్రశ్నలే సావిత్రి వెయ్యటము తాయారుకు విసుగనిపించింది. తన సంగతి

మర్చిపోవాలనీ, ఒక నిమిషమయినా మనసు ప్రశాంతంగా ఉంటుందేమోననీ వచ్చింది. ఇక్కడా అదే ప్రసక్తి.

మీరు కాని మీ వారు కాని ఇంట్లో ఉన్నట్లే కనబడదు. మీ యిద్దరి మాటా మేము యిక్కడికి వచ్చిన తరువాత వినలేదు. అబ్బ! ఎంత చక్కగా సర్దిపెట్టుకున్నారు. ఇల్లు? ఇంటిమీద మీ కెంత శ్రద్ధో?''

సావిత్రి నవ్వింది.

''మీ కెంత ఓపికమ్మా? ఎప్పుడూ ఇల్లు సర్దుతూనే ఉంటారు?'' అన్నది తాయారు.

మళ్ళీ నవ్వింది సావిత్రి.

వెంకటరమణ ఆనాడు ఆలస్యంగా యింటికి వచ్చాడు. ఆఫీసులో పని ఎక్కువయింది. ఉసూరుమంటూ గుండె చేతబట్టుకొని యింట్లో అడుగుపెట్టాడు బెరుకు బెరుకుగా.

''రాత్రిళ్ళు ఆలస్యంగా వస్తున్నారు. పని ఎక్కువయినట్టుంది. ఇలా ఉంటే ఆరోగ్యం చెడిపోతుంది. ముందు భోజనం చేద్దురుగాని రండి'' సావిత్రి అతడిని భోజనాల యింట్లోకి తీసుకువెళ్ళింది. ఇద్దరూ భోజనాలకు కూర్చున్నారు.

''పోనీ అక్కడ ఒక కప్పు పాలు తెప్పించుకోకూడదూ? ఇంతరాత్రి వేళ వస్తూకూడా మల్లెపూటూ, మరునమూ ఎట్లా జ్ఞాపకము పెట్టుకున్నారండీ?

ఆ మాట కతడు తుళ్ళిపడ్డాడు కొత్త వాతావరణము అతడిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. తనెక్కడ? మల్లెపూలెక్కడ? అవి తనను చాలా దూరంలో ఉంచాయి. అతడు తలవంచుకుకుని అన్నం తింటున్నాడు. పక్కవాటాలో దీపపు కాంతి తళ్లుక్కుమంటున్నది. పేపరు తిప్పుతున్న చప్పుడు కాబోలు రెపరెపలాడుతున్నది

సావిత్రి ముఖం ఉండి ఉండి ప్రకాశిస్తోంది. ఏదో చెప్పబోతున్నట్టుగా పెదవులు విప్పుకుంటున్నాయి. అతడికేమీ అర్థము కావటము లేదు. కాకపోయినా మనస్సు నిప్పుకోబోయింది. తనకుకూడా మనిషికున్న గౌరవము వస్తోంది.

కొందరి జీవితాలలో ఈ గౌరవము ఎప్పుడు కలుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఇన్నాళ్ళనుంచి రాయిగా ఉన్న మనసు ఇప్పుడంత మొండిగా లేదు.

సావిత్రి యీనాలుగు నెలలనుంచీ అతడిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. కాని అది మార్పుగా కాక అతిసహజంగా చిరకాలంగా ఉంటున్నట్టుగా ఉండాలని శ్రమపడుతున్నది. అతడు వేళకు యింటికి రావాలి. ఇద్దరూ కలిసి సినిమాకు వెళ్లాలి, పార్కులలో తనను వెంట బెట్టుకొని తిరగాలి. ఇంట్లో కిలకిల్లాడుతూ ఉండాలి. తనను అన్నింటికి అతడు మెచ్చుకోవాలి. అన్నిటికంటె ముఖ్యంగా సాయంత్రము ఆరు ఏడు గంటలవేళ సావిత్రీ అని ప్రేమ ఉట్టిపడే టట్టు పిలవాలి. తమ యిద్దరి కలయిక ఎంతో ఆదర్శంగా ఉండాలి. వాగార్థాలవలె క్షీరనీరాలవలె ఒకరిలో ఒకరు ఐక్యమయిపోవాలి. అట్లా నడచుకోవాలిద్దరూ.

సాయంకాలము ఆరూ ఏడు గంటలవేళ పక్కవాటాలో ఉన్న రంగధామం ఆఫీసునుండి యింటిని వచ్చేవేళ, పిల్లవాడు ఆకలికి ఏడ్చేవేళ, ఆ తల్లి వాడిని నాలుగు తిట్టి నేలకేసి కొట్టేవేళ, అతడు వచ్చిన గంటకు తల్లిగాని భార్యగాని సణుక్కుంటూ కాఫీగ్లాసు అందిస్తారు. అందుకో ఎందుకో చిటపటలాడుతూ ఒక్కోరోజు కాఫీ గ్లాసులు విసురుతూ కేకలు పెడుతూంటాడు. అటువంటి వేళ ఆ యింటివాళ్లంతా వింటూ ఉండగా ముఖ్యంగా రంగధామం చెవిన బడేటట్టుగా ఆప్యాయంగా సావిత్రీ అని వెంకటరమణ పిలిస్తే వినేవాళ్లు అసూయపడేటట్టుగా ఎంత మధురంగా ఉంటుంది?

వెంకటరమణకు ఇన్నేళ్లకు తన పుట్టినరోజన్నమాట చెవినబడ్డది. బాల్యంలో తల్లి ఏంచేసిందో అతనికి తెలియదు. గులాబీజాము వెజిటబుల్ కట్‌లెట్సు, అతడికి యిష్టమనుకుని చేసిన సేమ్యాపాయసమూ, జరీఅంచుల ధోవతీ, ఇంట్లో సరససంభాషణా....

సావిత్రి యీవంటకాలన్నీ పక్కవాటాలో యిచ్చి 'మా వారి పుట్టిన రోజ'ని చెప్పింది. ఆ సాయంత్రము తానే బలవంతము చేసి వెంకటరమణని సినిమాకు బయలుదేర తీసింది. రాత్రి యింటికి వచ్చిన తరువాత కిలకిల నవ్వుతూ ఎన్నో కబుర్లు చెప్పింది. అతడు అప్పుడప్పుడు 'ఊఁ ఆఁ' అంటూ ఊపిరాడని ఆశ్చర్యాన్ని అణచుకుంటున్నాడు. అప్పటికింకా పక్కవాటాలో దీపము వెలుగు

తున్నది. పడక కుర్చీలో పడుకొని రంగధామం పేపరు చదువుతున్నట్టు కనబడు తున్నది. పక్కవాటా తలుపు సందుల్లోంచి వస్తున్న వెలుగువైపు చూస్తూ ఉంటే ఉత్సాహము పొందులువారి ఆమె కిచకిచలాడిపోతున్నది.

పొద్దున్నే పాలవాడి కోసం సావిత్రి కిటికీలోనుంచి తొంగిచూస్తున్నది. ఏడున్నరకు అమిత చికాకుతో కాఫీగ్లాసు అందుకునే రంగధామం చూస్తూండగా తాను ఆరింటికి నవ్వుతూ వెంకటరమణకు కాఫీగ్లాసు అందించాలి. గబగబా పాల చెంబు అందుకొని డికాక్షను దింపి పాలు పొయ్యిమీద పెట్టింది

*　　*　　*

ఆంధ్ర యూనివర్సిటీలో సావిత్రి ఇంటరు చదివేటప్పుడు రంగధామం ఆనర్సు చదువుతున్నాడు. కాలేజి విద్యార్థులలోకల్లా అతడు బ్రైట్ స్టూడెంటని పేరు. చదువులోనే కాక ఇతర ఆటల పోటీలలోను వక్తృత్వపోటీలలోనూ నాటకాలలో వేషాలు వెయ్యటంలోను అతడి పేరు ప్రథమశ్రేణికి చెందింది. విద్యార్థులకు అన్నింటిలోను అతడు నాయకుడు. అతడు ఎవరితోనయినా మాట్లాడా డంటేనే ఎంతో అదృష్టవంతులమనుకునేవారు. ఉపాధ్యాయులకు కూడా అతడంటే ఎంతో మన్నన.

ఆడపిల్లలకు మగపిల్లల్తో కలిసి నాటకాలలో వేషాలు వెయ్యటమంటే ఎంతో భయంగా ఉండేది. ఎవరూ తూగివచ్చేవారు కాదు. అందుకని ఉపాధ్యాయులు అభ్యుదయ ఉత్సవాలలో నాటకాలు వద్దన్నారు. రంగధామానికి నాటకాలంటే ఎంతో అభిమానము. నటించటమంటే ఎంతో యిష్టము కాని స్త్రీ పాత్రలేని నాటకము ఏం బాగుంటుంది? ఎవరు స్త్రీ పాత్ర అభినయించటానికి అంగీకరిస్తారు? ఉపాధ్యాయులెంత చెప్పినా వినక తాను ఒప్పించి తీసుకువస్తానని ఉపాధ్యాయులకు మాట యిచ్చాడు.

ఆ రోజు క్లాసులయిపోవటంతోటే ఆడపిల్లలు రూము దగ్గర నిలబడ్డాడు. ఎవరయినా బయటికి వస్తే పలకరిద్దామని, అందరూ లోపలచేరి కిచకిచలాడు తున్నారు కాని ఒక్కరూ బయటికి రాలేదు అతడు లోపలికి పోవటానికి వీలు లేదు. పావుగంటసేపు తలుపుమీద దృష్టిఉంచి నిలబడ్డాడు. అదృష్టం కొద్దీ ఆయా అటుపోతూ కనబడ్డది ఎవరినయినా బయటికి రమ్మని ఆయాచేత చెప్పి పంపాడు. వెంటనే సావిత్రీ, సుబ్బలక్ష్మి బయటికి వచ్చారు.

వాళ్ళిద్దరితోటీ అతడు అభ్యుదయ ఉత్సవాలను గురించి మాట్లాడాడు. కార్యక్రమమంతా చెప్పాడు. నాటకాల సంగతి చెప్పి స్త్రీపాత్రల సంగతి వివరించాడు.

"మీలో ఎవరయినా యువరాణి పాత్ర వెయ్యాలి."

"బాబో! యువరాణి పాత్రే! స్టేజి మీదికి వచ్చేసరికి కాళ్లు వణుకుతాయి" అన్నది సుబ్బలక్ష్మి కళ్లు గుండ్రంగా తిప్పుతూ.

"మరి స్త్రీ పాత్రలేని నాటకమే లేదు. స్త్రీ పాత్ర మీరు నటించకపోతే ఇంకెవరు నటిస్తారు? మగవాళ్లు నటిస్తే ఏం బాగుంటుంది?"

"ఆ వేషం ఎవరు వేస్తారండీ? వేసి మర్నాడు కాలేజీకి రావటమే? గోడ సాహిత్యంలోకి ఆ పిల్లపేరు ఎక్కిపోదూ? మాకు కాలేజీలో చదవటమూ నాటకాలు వేయటమూ కాక జీవితంలో ప్రధానమయిన ప్రయోజనాలు ఉన్నాయిగా మరి? వాటిని ఇవి కించపరచకూడదు" సావిత్రి ధైర్యము తెచ్చుకొని గట్టిగా మాట్లాడింది.

"మీరు చెప్పినదంతా నేను ఒప్పుకుంటాను. మన కందరికీ ప్రధానమయింది మీరు చెప్పిందే. కాలేజీల్లో చదవటమూ, అభ్యుదయ ఉత్సవాలలో పాల్గొనటమూ మన సాంఘిక జీవితాన్ని ఉన్నతస్థితికి తీసుకుపోతాయి కాని కించపరచవు. నా వుద్దేశంలో ఎవరికీ ఎటువంటి దురభిప్రాయం ఉండదని" రంగధామం వేడుకుంటున్నట్లుగా ముఖం దీనంగా పెట్టాడు.

"మీరు అనుకోరనుకోండి. లోకం మాటేమిటి?"

"ఇతరుల సంగతి మనకెందుకు? వ్యక్తియొక్క ఔన్నత్యాన్ని విలువ కట్టడము అందరికీ సాధ్యంకాదు సావిత్రిగారూ! నా కోరికమీద మీరు యువరాణి పాత్ర ధరించాలి. మీ ముఖంలో, మాటలో, నడకలో ఆ హుందాతనము ఉన్నది. ప్లీజ్, ప్లీజ్ నా అభ్యర్థనను త్రోసిపుచ్చవద్దు."

సావిత్రి క్రీగంట రంగధామాన్ని చూసింది. కాలేజీ విద్యార్థులకందరికీ అతడు నాయకుడు. వీరోచిత గాంభీర్యము ముఖముమీద తాండవిస్తున్నది. మాట్లాడితే రాజులు కత్తిమీద చెయ్యి వేసినట్టుగా ప్యాంటు జేబులోకి చెయ్యి పోనిస్తున్నాడు మధ్యమధ్య ఉత్తమాశయాలను గురించి ఉపన్యాసాలు దంచుతున్నాడు.

కొంతసేపటికి సావిత్రి మనసు మెత్తపడ్డది. సరేనని ఒప్పుకున్నది. అతడు కృతజ్ఞత తెలుపుతూంటే పున్నమినాడు చంద్రుడితో కరచాలనము చెయ్యాలని ఉవ్వెత్తుగా విగిసిపడే సముద్రము మాదిరిగా ఆమె హృదయం పొంగులు వారింది.

నాటకప్రదర్శనము అయిన తరువాత గ్రీన్‌రూములోకి వచ్చాడు రంగధామం. సావిత్రి యింకా యువరాణి వేషములోనే ఉన్నది.

"మీరు కాలేజీ విద్యార్థి సంఘానికి పేరు తెచ్చారు. ఇంత బాగా నటించగలరని నేను ఊహించలేకపోయాను. ఇవాళ అధ్వర్యము వహించిన ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ప్రత్యేకంగా మిమ్మల్ని ప్రశంపించారు నూరురూపాయల విలువగల రవీంద్రకవీంద్రుల సాహిత్యము కొని మీకు బహూకరిస్తానన్నారు. నా కోరికమీద యువరాణి పాత్ర ధరించటానికి ఒప్పుకున్నందుకూ, అత్యుత్తమంగా నటించినందుకూ నా శుభాభివందనాలు" అతడట్లా ఆమెవైపు సూటిగా చూస్తూ ప్యాంటు జేబులో ఉన్న చేతిగుడ్డ తీసుకొని ముఖమంతా అద్దుకున్నాడు.

సావిత్రి కళ్లు కృతజ్ఞతతో మెరిసిపోయాయి. రెండు చేతులూ జోడించి తల వొంచింది.

అంతవరకూ సావిత్రికీ, రంగధామానికీ మధ్యఉన్న తెరలు ఈ నాటకంతో తొలగిపోయాయి. ఉత్సాహంతో, గౌరవంతో ఒకరినొకరు కలుసుకుంటూ ఉండేవారు. ఆమెలో ఉన్న ధైర్యస్థయిర్యాలను మెచ్చుకోకుండా ఉండలేకపోయేవాడు రంగధామం. అతడు యిస్తున్న ఉత్సాహము వల్లనే తనలో ఉన్న శక్తులు ఇనుమడిస్తున్నాయని ఆమె నమ్మకము. అతడు ఆమెను ప్రశంపిస్తున్నప్పుడల్లా ఆమె యీ మాట అనకమానదు. ఈ పరిచయాలతో రెండురోజుల కొకసారి అతడిని ఎక్కడైనా కలుసుకోలేకపోతే మనసంతా చీకటి చీకటిగా ఉన్నట్టుండేది సావిత్రికి. సావిత్రి ఆనర్సు ప్యాసు కాగానే కాలేజి మానేసింది రంగధామం లా కాలేజిలో చేరాడు. కాలేజి లైబ్రరీకి వెళ్లినప్పుడల్లా సావిత్రి రంగధామాన్ని కలుసుకునేది. ఇద్దరూ ఒకచోట కూర్చుని ఆప్యాయంగా కబుర్లు చెప్పుకునేవారు. సావిత్రి హృదయము అతడి మాటలలో ఉన్న తీపినంతా పోగు చేసుకునేది. మధుర మధురమయిన భావాలు మనసులో అల్లిబిల్లిగా అల్లుకునేవి. వాటిని తలుచుకొని విగ్గిలిపోయేది.

ఉత్సవాల తరువాత మిగతా విద్యార్థినీ గణమంతా ఆమెవైపు అదొకమాదిరిగా చూసేవారు. రంగధామం సంగతి అందరికీ తెలుసు. అంతంత మాత్రమైన వాళ్ళను అతడు కన్నెత్తి చూడడు ఆడపిల్లలందరూ "అతడికి గర్వము-అహంభావము." అనుకుని దూరదూరంగా తిరిగేవారు.

సావిత్రి తనలో ఏదో ప్రత్యేకత ఉన్నదనుకునేది. ఆ ప్రత్యేకతను అతడు గుర్తించినందువల్లనే తనతో చనువుగా ఉన్నాడనుకుంటూ ఉండేది. ఈ సంగతి కనిపెట్ట కలిగింది ఒక్క సుబ్బలక్ష్మి.

"సావిత్రీ! నీవు నిజంగా అదృష్టవంతురాలవు. అతడు ఫస్టుమార్కులు తెచ్చుకున్నవాళ్ళనయినా కన్నెత్తి చూశాడా చెప్పు?" జడ వీపుమీద కొడుతూ సావిత్రి చెవులు సాగదీస్తూ ఉండేది సుబ్బలక్ష్మి. అటువంటి సమయాలలో సబ్బలక్ష్మి పైటకొంగు సావిత్రి చేతిలో మెలికలు తిరుగుతూ ఉండేది.

సావిత్రి జేగురుమబ్బుల వింతవెలుగులో సముద్రపుటొడ్డున కూచుని ఇసుకలో వేలితో ఏదో రాస్తున్నది. జీడిపలుకుల సంచులు ఎగరవేసుకుంటూ రంగధామం తన భవిష్యత్తు అంతా ఊహించి ఆమెకు చెప్పుతున్నాడు. లా చదివిన తరువాత ప్రాక్టీసు కొరకు తొందరపడకుండా పైచదువులు చదువుతానన్నాడు. ఇంగ్లండువెళ్ళి బారట్లా అవాలని ఉన్నదన్నాడు. కళ్ళు తిప్పుతూ కుతూహలంతో, ఉత్సాహంతో జడలు విప్పుతూ అల్లుతూ అతడినే చూస్తున్నది సావిత్రి ఇసుకలో తలక్రింద చెయ్యిపెట్టుకొని నెలవంకకేసి చూస్తూ కూనిరాగాలు తీస్తున్నాడు రంగధామం. సావిత్రి ముసిముసి నవ్వులతో రంగధామాన్ని ఎన్నెన్నో ప్రశ్నలు వేయాలనుకున్నది. కాని ఆమె సిగ్గే ఆమెకు అవరోధమయింది. ఇటువంటి అవకాశాలు చేజిక్కి కూడా జారిపోయ్యాయి చాలాసార్లు.

సావిత్రి ఆనర్సు పూర్తిచేసింది. "ఇంకా పైన చదువుతావా అమ్మా" అని తండ్రి అడుగుతాడని అనుకుంది. కాని ఆయన సంబంధాలు చూడటము మొదలుపెట్టాడు. ఆయనకు అన్ని విధాల నచ్చిన రెండింటిని తిరగ్గొట్టింది.

"నీ విలా చేస్తావనుకోలేదమ్మా" చెమట పట్టిన ఫాలభాగాన్ని గోడవైపుకు తిరిగి తుడుచుకుంటూ అన్నాడు.

"నీకు నచ్చాడా అని అడిగావు కనుక చెప్పాను నాన్నా!" అన్నది సావిత్రి తలవంచుకొని.

"అవునమ్మా! నీకు చూపించకుండా నీ సమ్మతి లేకుండా చేస్తానా! ఆనర్సు ప్యాసయిన పిల్లతో ఎలా వ్యవహరించాలో నాకు తెలీదనుకున్నావా?" అన్నాడు ఆమె ముఖంచూస్తూ.

"అందుకనే మనసులో ఉన్నమాట చెప్పాను."

"చూడు సావిత్రీ!" అంటూ ఆయన దగ్గరగా కూర్చుని ఆమె వీపుమీద రాస్తూ "డాక్టరు నాకు రక్తపుపోటు హెచ్చిందన్నాడు. అందుకనే త్వరలో పెళ్ళి చేయాలనుకుంటున్నాను. సెలవుపెట్టి అలహాబాదునుంచి రమ్మని అన్నయ్యకు వ్రాశాను. అన్నయ్య రెండు నెలలపాటు ఉంటాడు. ఈ రెండు నెలల్లో నీ పెళ్ళి అయిపోవాలి. ఆస్తి వివరాలన్నీ వాడికి చెప్పేస్తాను. పెళ్ళిచేసి నిన్ను అత్తవారింటికి పంపిస్తే ఒంటరిగాడిని నేనెక్కడయినా ఉండొచ్చు. నీ మనసులో ఉన్నది చెప్పు తల్లీ. పోనీ నీ దృష్టిలో ఎవరయినా ఉన్నారా చెప్పు?"

సావిత్రి నేలచూపులు చూడటము మొదలుపెట్టింది ముఖంమ్మీద చిరునవ్వు చిందులాడింది. అప్పటికప్పుడు నిండుగా ఉన్న బుగ్గలు గులాబీలయ్యాయి.

"నాకు చెప్పలేకపోతున్నావు పోనీలే అమ్మా! అన్నయ్య రాగానే మళ్ళీ మాట్లాడుకుందాము."

ఆ విషయము అప్పటికి వాయిదా పడినందుకు సావిత్రి మనసు తేలికపడ్డట్టయింది.

నిరంజను సంబంధాలను గురించి తండ్రి చెప్పగా విన్నాడు. తన పాత స్నేహితులను కూడా విచారించాడు. నాలుగురోజుల తరువాత సావిత్రిని సంభాషణల్లో ఇరికించాడు. కాని సావిత్రి బయపడలేదు.

నిరంజను వచ్చినప్పటినుండీ భారమంతా అతడి మీదపెట్టి తండ్రి నిశ్చింతగా ఉన్నాడు. సాయంత్రము కాగానే తండ్రీకూతుళ్ళు తోటల్లో కూర్చీలు వేసుకొని కూర్చునేవారు. తిరిగి తిరిగి వచ్చిన నిరంజను ఉస్సురంటూ వాళ్ళతో కబుర్లందుకునేవాడు.

ఆదివారంనాడు తీరికగా సుబ్బలక్ష్మి వచ్చింది సావిత్రిని చూడటానికి. "వారం రోజులనుండీ రావాలనుకుంటే ఒళ్లు బడలిక చేసింది."

"ఏం పని చేశావు ఒళ్లు బడలిక చేయటానికి?"

"బస్సులో నూటయాభై మైళ్లదూరము వెళ్లాము పెళ్లికి. అది ఒక పల్లెటూరు. నడుస్తూఉంటే కాళ్లు దిగబడేటంత బురద. ఇంతకూ పెళ్లికొడుకు ఎవరో తెలుసా? రంగథామం. పెళ్లికూతురు పట్టి అమాయిక. పెద్దచదువు చదువు కొని బస్తీలో ఉన్న నాగరికుడు ఆ పిల్లను చేసుకున్నాడు."

సావిత్రి తల గిరగిర తిరిగినట్లయింది. కుర్చీకి దేహాన్ని అణుచుకొని కూర్చుంది. సుబ్బలక్ష్మి ఐస్క్రీము తిని కాస్త సావిత్రి బుగ్గకు రాచి కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వెళ్లిపోయింది

మధ్యాహ్నంవేళ తండ్రీ అన్నా గదిలో కాఫీ తాగుతున్నారు. పేపరు చేత బట్టుకొని గదిముందర నిలబడ్డది. ఏ పదిహేను రోజుల క్రిందటో చెప్పాలనుకున్న మాటను అన్న బయటపెట్టలేక దాచినట్టున్నాడు. మాటలు స్పష్టంగానే వినబడు తున్నాయి.

"కాలేజీలలో చదువుతూ నాటకాలలో వేషాలు వేస్తూ తిరిగే పిల్లలు తనకు వద్దన్నాడు నాన్నా! ఈ సావిత్రికి అతడిమీద మనసున్నట్టుగా చూచాయగా కని పెట్టాను. అతడన్న మాట దానితో ఎలా చెప్పను?"

తండ్రి బరువుగా నిట్టూర్చటము సావిత్రికి స్పష్టంగా వినబడ్డది. సావిత్రి వెనక్కు నడుస్తూ వెళ్లి డ్రాయింగురూములో సోఫామీద కూలబడ్డది. కాలేజీలో చదువుతున్న పిల్లలు పెళ్లికి పనికిరారా! చదువులమీద లెక్చెర్లు యిచ్చిన రంగ థామం! నాటకంలో పాత్ర వెయ్యమని తనను బలవంతం చేసిన పెద్దమనిషి! తన స్వంతానికొకమాటా, ఇతరులకొక మాటా? పెళ్లి చేసుకోకపోతే పోయాడు. కాని కాలేజీ విద్యార్థినులమీద ఎంతవిసురు విసిరాడు? తండ్రిగాని అన్నగానీ ఆ గదిలోకి వచ్చి తన పరిస్థితి చూస్తారేమోనని సావిత్రి భయపడ్డది తన తొట్రుపాటును అణగద్రొక్కటానికి ఎంతో ప్రయత్నించింది. ముఖానికి అడ్డంగా పత్రిక పెట్టుకొని గంటకుపైగా బాధపడుతూ కూర్చుంది.

తండ్రి తనతో ఏదో చెప్పాలనుకుని చెప్పలేకపోవటము సావిత్రి కని పెట్టింది. ఆ నాలుగు రోజులలో తండ్రి మరీ బలహీనుడయినట్టు కనబడ్డాడు. నిరంజను ముఖావంగా తప్పుకొని తిరుగుతున్నట్టుగా తిరిగాడు.

నాలుగురోజులు నిద్ర పట్టలేదు సావిత్రికి. ఆకలి లేనట్టే అనిపించింది. శరీరం గాలిలో తేలిపోతున్నట్టనిపించింది.

అయిదవనాడు ఆమె మనసులో ఏ వేదనాలేదు. మనసు నిర్వికారంగా ఉన్నది. అయిపోయిన పెళ్ళికి బాజాలెందుకని మనస్సును అదిమిపెట్టడములో నిమగ్నురాలయింది.

"ఏం నాన్నా! అన్నయ్యకు సెలవులు అయిపోలా?"

"నాన్నా! మనం కూడా అన్నయ్య దగ్గరికి వెళ్ళి ఉంటే బాగుండదా?"

"బాగుంటుందమ్మా-కాని ఇంకా ఆవేళ రాలేదు." తండ్రి అన్న ఆవేళ యేమిటో సావిత్రి గ్రహించింది. ఆయన మనసులో పడుతున్నబాధ ఏమిటో ఆమెకు తెలుసు. పైకి చెప్పలేక మదనపడిపోతున్నది.

వారంరోజుల వ్యవధిలో అన్న కుదిర్చిన సంబంధము సావిత్రి చూడకుండానే ఒప్పుకుంది. మహూర్తం కూడా వెంటనే కుదిరింది. వెళ్ళి సత్రంలో జరిగిపోయింది. నిరంజను తీసుకొని వచ్చిన పెళ్ళికొడుకుచేత సావిత్రి తాళి కట్టించుకుంది. తండ్రి కాళ్ళకు దణ్ణంపెట్టుతూ ఆయన పాదాలు కన్నీడితో తడిపివేసింది. "నాన్నా! నీ మనసు యిప్పుడు సంతోషంగా ఉన్నదా?" అంటూ తలెత్తి చూసింది ఒక పక్క కన్నీళ్లు కారుస్తున్నా తండ్రిముఖం ఆనందంతో వెరిగిపోవటము సావిత్రి గమనించింది.

వెంకటరమణ కష్టపడి బి. కామ్. యల్. యల్. బి ప్యాసయిన విద్యార్థి అతడు సిద్దంసెట్టి అరుగులమీద నివాసమేర్పరచుకున్నాడు. వీధిదీపాల వెలుగులో చదువుకొని పరీక్షలు ప్యాసయాడు. లేమిడి పెనవేసుకుపోయిన జీవితము. చదువుకోగానే ఉద్యోగములో చేరేడు. అతడిలో అందము ఉన్నది. తెలివీ చురుకుదనమూ ఉన్నాయి. చూడగానే నిరంజనుని ఆకర్షించాడు. ఇంటి అల్లుడిని చూసుకొని తండ్రీ కొడుకులెంత మురుస్తున్నారో సావిత్రి గ్రహించింది. పెళ్ళిఅయిన ఈ అయిదారు సంవత్సరాలలో ఒక్క స్నేహితురాలినయినా చూడటము సావిత్రికి తటస్థించలేదు. వాస్తవానికి తను ఎవరికంటా పడకుండా మరుగుపడిపోదామనుకుంది. ఒకనాటి మధ్యాహ్నం సుబ్బలక్ష్మి ఎక్కడినుంచో ఊడిపడ్డది. ఆమెను చూడగానే సావిత్రి గుండె గతుక్కుమన్నది.

"నన్నుచూసి భయపళ్ళేదు కదా?" సావిత్రి భుజమ్మీద చెయ్యివేస్తూ అడిగింది. సుబ్బలక్ష్మి అంటే సావిత్రికి మొదటినుంచీ భయమే. పైకి మాట్లాడుతూనే ఎదుటిమనిషి మనసంతా శోధిస్తూ ఉంటుంది. ఎవరి మనసులోనన్నా మాయామర్మం కనబడితే బయటికి లాగేవరకూ నిద్రపోదు.

సుబ్బలక్ష్మిని వసారాలో కూర్చోబెట్టి కాఫీ యిచ్చింది సావిత్రి.

సుబ్బలక్ష్మిభర్త. డాక్టరు ఆయనకు ఆ ఊరు బదిలీ అయిందట. ఒక స్నేహితుడియింట్లో దిగి మూడునెలలనుంచీ ఆ ఊళ్ళోనే ఉంటున్నాడట. తాను ఆ ఉదయమే వచ్చిందట. సావిత్రి ఇక్కడున్నట్లు విశాఖపట్నంలోనే తనకు తెలిసిందట. ఈ సంగతులన్నీ గలగల్లాడుతూ చెప్పింది.

సుబ్బలక్ష్మి ఇల్లంతా ఒకసారి కలయ తిరిగింది. సావిత్రిగుండె పీచుపీచు మంటున్నది.

నీ వెప్పుడూ పుస్తకాలమధ్య కీలకంలా ఉండేదానివి. నీపుస్తకాలూ, షెల్ఫులూ ఎక్కడా కనబడవేం?" గూట్లో నిర్లక్ష్యంగా పడేసిన న్యూస్ పేపర్లన్నీ తిరిగేస్తూ అడిగింది సుబ్బలక్ష్మి.

"ఈ చిన్న యింట్లో ఆ పుస్తకాలన్నీ తెచ్చి ఎక్కడ పెట్టను? విశాఖపట్నంలో నాన్న పుస్తకాలకే ఒకగది ఏర్పాటు చేశారు."

"అబ్బబ్బ. పుస్తకాలు ఎక్కడపెట్టుకుంటావని కాదు నేనడిగింది. ఇక్కడ కూడా ఆ అలవాటు సాగించుకుంటున్నావా అని!"

"యథాప్రకారంగా"

సుబ్బలక్ష్మి ఊఁ అంటూ తలాడించింది. "నిన్ను చూసి ఆరేళ్ళయింది. బాగా చిక్కావు సావిత్రీ."

ఆరేళ్ళయింది కనుకనే చిక్కావనీ అలవాట్లు మారాయనీ ఊహిస్తున్నావు."

"అమ్మాయీ నీవు సుబ్బలక్ష్మితో మాట్లాడుతున్నావు తెలుసా? నీవు చిక్కకపోతే ఆ జాకెట్టుచేతులు అలా వేలాడిపోతాయా? నీ కుట్టుపని అంతా ఏమ

యింది? ఒక్క బిల్లమీదనయినా బట్టలేదు. ఇంత సోమరితనం ఎట్లా వచ్చిందంటావు?"

"అబ్బబ్బ సుబ్బలక్ష్మి! ఇన్ని ప్రశ్నలు ఒక్కసారి అడిగితే ఎట్లా జవాబివ్వను చెప్పు? ఇది సంసారం. పెళ్ళికానప్పుడు సూదీదారం పట్టుకునో-పుస్తకం పట్టుకునో కూర్చున్నట్టుగా ఇప్పుడు జరుగుతుందా చెప్పు?"

"పోనీ అదంతా వద్దులే. మా బావగారి సంగతి చెప్పు. నీవు అడగక పోయినా నా సంగతంతా చెప్పేశాను చూడు."

సుబ్బలక్ష్మి రెండుగంటలసేపు ఈ మాటా ఆ మాటా అడుగుతూ వేధించి వేధించి వెళ్ళిపోయింది. సుబ్బలక్ష్మి సావిత్రినీ వెంకటరమణనూ తను యింటికి రమ్మని ఆహ్వానించింది.

సావిత్రి తలఊపింది. సుబ్బలక్ష్మి వెళ్ళిపోయిన తరువాత 'అమ్మయ్య' అనుకుంది. ఆమె ఉన్నంతసేపూ మనసులో భయమే. మాటల్లో చూపుల్లో ఏ సంగతి బయటికి లాగుతుందోనని ఎవరికీ కనబడకుండా మారుమూల పడుందామనుకుంటే ఈ సుబ్బలక్ష్మి ఎక్కడినుండో ఊడిపడ్డది.

వారం రోజులకొకసారయినా సావిత్రీ వెంకటరమణా తమ యింటికి రాకపోతే సుబ్బలక్ష్మి ఊరుకునేది కాదు. వెంకటరమణ ఎవరితో మాట్లాడినా సావిత్రి ముఖము చూసి మాట్లాడేవాడు. అతడు పడుతున్న బాధేమిటో సుబ్బలక్ష్మి కనిపెట్టటానికి ఎక్కువసేపు పట్టలేదు. ఆ మాటల్లో ఏదో వెలితి కనబడుతున్నట్లుండేది. అతడి బెరుకుచూపులు చూసి సుబ్బలక్ష్మి నవ్వుకుంది.

సుబ్బలక్ష్మి యింటికి వెళ్ళినన్నిసార్లు తమయింటికి వాళ్ళను పిలువలేకపోయింది సావిత్రి. సందర్భము కూడా కలిసిరాలేదు. అనుకోకుండానే సుబ్బలక్ష్మి భర్తకు అక్కడినుంచి బదిలీ అయింది. సుబ్బలక్ష్మి కుటుంబాన్ని సావిత్రి భోజనానికి పిలిచింది. వెళ్ళుతూ "నీవు చదువుకున్న మొద్దువైపోయావు" అంటూ వీపు మీద కొట్టి సుబ్బలక్ష్మి బండెక్కింది.

ఆ దెబ్బకు సావిత్రి ఉలిక్కిపడ్డది. ముఖం పాలిపోయింది. ఎవరయినా చూశారేమోనని దిక్కులు చూసింది. దూరంగా మగవాళ్లు మాట్లాడుకుంటున్నారు. అమ్మయ్య అనుకుంది.

ఒక్క ఏడాదిపాటు తెలిసినవాళ్ళు ఎవరూ కనబడలేదు. సావిత్రి మనసు హాయిగా ఉన్నది. బయటిప్రపంచంతో ఏ ప్రసక్తి లేకుండా ఉంది. పుస్తకాలు చదివే అలవాటు సంసారంలో పడగానే దానంతట అదే నశించిపోయింది. మిగతా అభిరుచులూ, అభిలాషలూ ఆలనా పాలనా లేక అణగారిపోయాయి. ఆయన ఆఫీసుకు వెళ్ళగానే వాకిట తలుపు గొళ్ళెము పెట్టుకొని ఏకాంతంగా కూర్చుని గాత్ర సంగీతం సాధన చేస్తు ఉండేది. రెండుమూడు గంటలు భజనకీర్తనలూ అవీ పాడుకున్న తరువాత ఆమెతో గూడుకట్టుకున్న ఆవేదనంతా చల్లారినట్లుండేది. వర్షించిన మేఘంలా మనసు తేలికపడేది.

మందకొడిగా, యాంత్రికంగా సావిత్రి రోజులు దొర్లిస్తున్నది. షెల్ఫుమీద చనిపోయిన తండ్రి ఫోటోకెదురుగా నిలబడి "నీ ఆత్మశాంతి కోసమే నేను బతుకుతున్నా నాన్నా!" అనుకునేది. ఎప్పుడుచూసినా ఆ ఫోటోలో తండ్రి ముఖము నవ్వుతున్నట్లుండేది.

*　　　*　　　*

ప్రక్కవాటాలోవున్న తయారు పురిటికి వెళ్ళింది. ముసలమ్మ చిన్నపిల్లలా ఉరుకుపరుగులతో కాఫీ చేసి యిస్తున్నది. వేళకు వంట ఐనా చిందులు గంతులు వినబడుతూనే ఉన్నాయి. కటికి ఉపవాసాలు చేస్తున్నట్టుగా నిట్టూర్పులూ మూలుగులూ పక్క యింట్లో తాండవమాడుతున్నాయి.

మధ్యాహ్నంవేళ ముసలమ్మ తీరికగా వచ్చి సావిత్రి దగ్గర కూర్చుంది. సావిత్రి వెంకటరమణ కొనం కుట్టుతున్న స్వెట్టరు పూర్తిజేస్తోంది. సూదులూ, ఊలూ గబగబ కదిలిపోతున్నాయి.

"నీవు ఒక్క నిమిషమయినా వృథాపోనీయవమ్మా. మీ ఆయన ఎంతో అదృష్టవంతుడు పెట్టిపుట్టాడు."

ఆ మాటకు సావిత్రి గలగలా నవ్వింది. కాని ఆ నవ్వు బలవంతంగా నవ్వినట్టుంది. ఇతరులను అసూయపరచాలనే బెణుకు లేకపోలేదు దానిలో.

ప్రొద్దున్నే వచ్చినవాన సన్నగా మొదలయి చూస్తూ ఉండగానే కుండపోత వర్షమయింది. సావిత్రి మసాలాదోసెవేసి వేడివేడిగా ఉండాలని పెట్టమ్మదనే

ఉంచింది. ముసలమ్మగారు ఇస్త్రీచేసిన గుంటూరుచీరె కట్టుకొని కొంగు దోపుకుంటూ "అమ్మాయీ! మా కోడలికి పురుడు వచ్చింది. మగపిల్లవాడు. పుట్టాడు. నేనూ అబ్బాయీ చూడటానికి వెళ్ళుతున్నాము ఈ నాలుగు గంటల బండీలో."

"ఎన్నాళ్ళు మకాం చెప్పరూ?"

"ఇక మళ్లీ యిక్కడికి రామమ్మా. అబ్బాయికి అనకాపల్లి బదిలీ అయింది. అటునుంచే వెళ్ళుతాము."

"రెండు శుభవార్తలూ ఒక్కసారే చెప్పారు." సావిత్రి ఆమెకు బొట్టు పెట్టి కొబ్బరికాయ చేతికి యిచ్చింది.

"చిన్నపిల్లవయినా ఎంతో తెలివిగా కాపురం చేస్తున్నావమ్మా. నిన్ను చూస్తూంటే నాకెంతో ఆనందంగా ఉంటుంది."

సావిత్రి పొడినవ్వు నవ్వుతూ ఆమెను సాగనంపింది. లోపలికి వచ్చి మెడా, చేతులూ పూర్తికాని స్వెట్టరు ఒక మూలకు విసిరేసింది.

సావిత్రి చేసిన మసాలాదోసెలు వెంకటరమణ వచ్చేసరికి చప్పగా చల్లారిపోయాయి ఆ రాత్రికి బద్ధకంగా ఉండి చారూ, అన్నమే చేసింది. సావిత్రి అంత ఉత్సాహంగా లేకపోయినా మామూలు ఇంటి పనులన్నీ చేసుకుంది. వెంకటరమణ ఫైల్సు చూసుకుంటూ ఉంటే తాను పక్కలూ దిండ్లూ సర్దింది. కిటికీ తలుపుతీస్తూ ఉంటే మల్లెలూ మరవమూ కలిపికట్టిన మూరెడు మూల కనబడ్డది

వెంకటరమణ వైపు తలెత్తి చూసింది. అమాయకంగా ఫైల్సు చూసుకుంటున్నాడు. ఆనాడు అతడు మల్లెపూలూ మరువమూ తెచ్చినట్టూ, తను సంతోషంతో పొంగిపోయినట్లూ ఏవో మాటలు ఆ రంగథామం వినేటట్లుగా అన్నది. అసూయతో దహించుకొనిపోయి ఉండాలి అతడు. కాని యిప్పుడు నిజంగా మల్లె దండ తెచ్చాడు వెంకటరమణ. పక్కవాటాలో ఉడుక్కునే రంగథామం లేడు. చీకటిచీకటిగా ఉంది పక్కవాటా. సావిత్రిలో ఉత్సాహపు పొంగు రాలేదు. నీరసంతో దేహము వేలాడిపోతున్నది

వారపత్రికలూ, దినపత్రికలూ చేతికందినవన్నీ పుటలు త్రిప్పి పడేసింది సావిత్రి. తనకు యిష్టమనుకున్న కవిత తీసి చదువబోయింది. ఇన్నాళ్ళనుంచీ మనసులో గూడుకట్టుకున్న అవమానము, ఆవేదన పొంగుతున్నాయి. కాని చల్లారటం లేదు. పెరట్లోకి వెళ్ళే గదితలుపులు తెరచి గడపలో కూర్చుంది. తెలియ మబ్బుల పరుగులలో నెలవంక తొంగిచూస్తున్నాడు. సావిత్రి కూనిరాగం తీస్తూ కళ్లు మూసుకొని మీరాబాయి భజనలు పాడుకుంది సన్నగా.

అలవాటు ప్రకారం వెంకటరమణ ఫైల్సు తిరగవేసుకుంటున్నాడు. సావిత్రి చివాలున లేచింది. స్నానాలు గదిలోకి వెళ్ళి ఆ చన్నీళ్ళే నాలుగు చెంబులు పోసుకొని చందనంసబ్బు ఘుమఘుమలతో పాముకుబుసంలాంటి సన్నటి చీరె ధరించి బయటికి వచ్చింది. దోసగింజ బొట్టు పెట్టుకొని మల్లెదండ తలలో పెట్టుకొని ఓయ్యారంగా వెంకటరమణ కుర్చీ దగ్గరగా నిలబడి "ఇలా కూర్చుని రాత్రీ పగలూ పనిచేస్తే ఆరోగ్యం పాడవదూ? గంట చూశారా పన్నెండు కావచ్చింది?"

వెంకటరమణ తలెత్తి చూశాడు సావిత్రిని. ఆమె ముఖములో ఒక వింత వెలుగు వెలుగుతున్నది. ఆమె కళ్లు చిలిపిగా నవ్వుతున్నాయి.

వెంకటరమణకు క్రమంగా ధైర్యము వచ్చింది. ఆ చీకట్లో కూడా సావిత్రి కళ్ళు పక్కవాటా వైపు తిరిగాయి మామూలుగా.

కిటికీ తలుపు సందుల్లోనుంచి నెలవంక కనబడీ కనబడకుండా దోబూచులాడుతున్నాడు. చెంపమీదుగా జాలువారిన కన్నీటిని సావిత్రి వెంకటరమణ చూడకుండా కొంగుతో తుడుచుకుని ఫ్లాస్కులో పోసి ఉంచిన వేడివేడి పాలు కప్పులో పోసి ఒయ్యారంగా అతడి చేతి కందించింది.

('యువ' మాస పత్రిక)

(1967 లో ఆంధ్ర రచయితల సహకార సంఘము వారు ముద్రించిన కథా సంకలనము "చేమంతులు"లో చేర్చబడినది)